క్లుప్తంగా

భూములు సద్వినియోగం చేసుకోవాలి

మరికల్: కోయిల్‌సాగర్, మన్నేవాగు కాల్వలకు సంబంధించి రైతుల నుంచి తీసుకున్న భూములను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు ఎర్ర దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేపీసీ కాల్వలకు సంబంధించిన భూములకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చినా ఇంత వరకు భూములను స్వాధీనం చేసుకోలేదన్నారు. ఆ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి



మద్దూరు: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల మేరకు నిర్మించుకోవాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో హౌసింగ్ ఏఈ శాంత్‌కుమార్‌తో కలిసి నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేశారు. ఈ గ్రామంలో మొత్తం 10 మందికి ఇళ్లు మంజూరు కాగా గురువారం మూడు ఇళ్లకు మార్కింగ్ వేశారు. విడతల వారిగా డబ్బులు మంజూరు అవుతాయని, లబ్ధిదారులు నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూనెగింజల సాగుపై దృష్టి పెట్టాలి

అమరచింత: ఒకే రకమైన పంటల సాగు వల్ల భూములు సారం కోల్పోయే ప్రమాదం ఉందని, రైతుల ఇతర పంటల సాగుపై చొరవ చూపాలని జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ సైంటిస్టు డాక్టర్ సురేష్ తెలిపారు. మండలంలోని మస్తీపురం, నందిమళ్ల గ్రామాల్లో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు నూనె గింజల సాగుపై అవగాహన కల్పించారు. నూనె గింజల పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలను సాధించే అవకాశం ఉందన్నారు. పంటల సాగులో ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే భూసారం పెంచుకోవడానికి రైతులు జీనుగా, పచ్చరొట్టె పంటలను సాగుచేసి భూమిని దున్నుతే ప్రయోజనం ఉంటుదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు రైతులు రసాయనిక ఎరువులతో కాకుండా సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేసుకోవాలని పేర్కొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు



కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో గురువారం రాంరెడ్డి లయన్స్‌క్లబ్, వాకిటి శ్రీహరి అభిమాన సేవ సమితి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని సేవ సమితి వ్యవస్థాపకులు రవికుమార్ అన్నారు. శిబిరానికి మొత్తం 150 మంది రాగా కంటి పరీక్షలు నిర్వహించి అందులో 80 మందికి కంటిపొర సమస్యలు ఉండడంతో ఆపరేషన్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు నూరుద్దీన్, హుస్మానుద్దీన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్ఫరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

బోనస్ వెంటనే విడుదల చేయాలి



ధన్వాడ: రైతుల విక్రయించిన వరి ధాన్యానికి సంబంధించిన బోనస్‌ను వెంటనే విడుదల చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. క్వింటాల్ సన్నరకం వరికి రూ.500 బోనస్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సన్నరకం వరి సాగు చేసి ప్రభుత్వానికి విక్రయించారన్నారు. కానీ ఇప్పటి వరకు బోనస్ డబ్బులు జమ చేయలేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో పత్తి, కంది, వరి విత్తనాలు కొనేందుకు డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రైతుల కష్టాలను అర్థం చేసుకొని వెంటనే నగదు జమ చేయాలని కోరారు.

ఇసుకను అడ్డంగా దోచేస్తున్నారు



నిడ్జింత వాగులో అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న దృశ్యం

- అధికారుల కనుసైగలో తరలుతున్న ఇసుక
- 100కు డయల్ చేసినా స్పందన కరువు

కొత్తపల్లి: మండల పరిధిలోని వాగు పరిసర గ్రామాల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వాగుల్లో నుంచి ఇసుకను తవ్వుకొని జేబులు నింపుకుంటున్నారు. రాత్రి వేలల్లో ఏకంగా జేసీబీలను ఏర్పాటు చేసుకొని ఇసుకను ట్రాక్టర్లలో నింపి పట్టణాలకు తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక తరలిస్తున్నట్లు చెప్పుకుంటూ ఇసుక మాఫియాతో చేతులు కలిపి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొరవడిన నిఘా

మండల పరిధిలోని వాగు పరిసర ప్రాంతాల్లో అధికారుల నిఘా కొరవడడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రైతులను బెదిరించి ఇసుకను అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఈ విషయమై ఆపద సమయాల్లో 100 నంబరుకు ఫోన్ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందిస్తే తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారే తప్ప అక్రమ ఇసుక తరలింపునకు అడ్డుకట్ట మాత్రం పడటం లేదు. రోజూ ఏదో ఓ మీడియాలో అక్రమ ఇసుక తరలింపు వార్తలు ప్రచురితమైనా ఇసుక మాఫియాలో ఎలాంటి భయం కనబడడం లేదు. మండలంలో ప్రభుత్వ భవనాలకు, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక లభించకపోవడంతో నిర్మాణాలు పునాదులకే పరిమితమవుతున్నాయి. అధికారులు మాత్రం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలను పట్టుకొని తక్కువ మొత్తంలో ఫైన్ వేసి వదిలేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నది తీర ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **ఇకపై మరింత నిఘా పెడతాం**
>
> మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటాం. ఇకపై మరింత నిఘా పెడతాం. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే ఎంతటి వారైనా సరే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.
>
> – జయరాములు, తహసీల్దార్, కొత్తపల్లి

‘భూ భారతి’తో రెవెన్యూ సమస్యల పరిష్కారం



గురువలింగంపల్లిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



రైతుల భూ సమస్యలపై సూచనలు ఇస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి

నర్వ: భూభారతి ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. గురువారం ఉందేకోడ్, జక్కన్నపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జక్కన్నపల్లిలో 14 ఏళ్లుగా సర్వేనెంబర్ 111లో 14 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ, దాసరి, బీసీ కుటుంబాలకు ఇచ్చారని ఈ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ప్రసాద్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రొహిబిటెడ్ జాబితాలో ఉన్న కారణంగా 14 ఏళ్లుగా వీరికి రైతు బంధు, రైతు బీమా లాంటి ఏ పథకాలు వర్తించడం లేదన్నారు. సదస్సులో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, ఆర్‌ఐలు ఆశా, మల్లేష్, సిబ్బంది బాలరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సత్వర పరిష్కారం

కొత్తపల్లి: భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ జయరాములు తెలిపారు. గురువారం మండల పరిధిలో నిర్వహించిన సదస్సులో నందిగామలో 3, తిమ్మారెడ్డి పల్లి లో 17 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ శ్రావణ్ కుమార్, నర్సింములు, కార్యాలయ సిబ్బంది మహేశ్, అశోక్ పాల్గొన్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కోస్గి రూరల్: రైతులు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోస్గి, గుండుమాల్ తహసీల్దార్లు బక్క శ్రీనివాసులు, భాస్కరస్వామి అన్నారు. గురువారం కోస్గి మండలంలోని తోగాపూర్, ఈజీపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 11 ఫిర్యాదులు, గుండుమాల్‌లో 24 ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యంఆర్‌ఐ వెంకట్రాములు, సీనియర్ అసిస్టెంట్ రామేశ్వరమ్మ , జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్, మహేష్, స్వాతి, జ్యోతి పాల్గొన్నారు.

14 అర్జీల స్వీకరణ

మాగనూర్: భూ సమస్య పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మాగనూర్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలో గురువలింగంపల్లిలో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 14 అర్జీలు రాగా పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుండుమాల్‌లో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్ భాస్కరస్వామి

జూలై 9న సమ్మె విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు భూపాల్

నారాయణపేట: కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరంచి, కొన్నింటిని రద్దు చేసి యాజమానులకు అనుకూలంగా ప్రధాని మోదీ తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మే 20న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని అయితే పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమ్మెలో జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేసేందుకు ప్రణాళికబద్ధంగా సన్నాహాకాలు మొదలు పెట్టాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకులు వెంకట్రామరెడ్డి, బాల్‌రామ్, ఆంజనేయులు, గోవిందరాజ్, కాశీనాథ్, బాలమణి, సౌభాగ్య పాల్గొన్నారు.

చేనేత రుణ లబ్ధిదారుల జాబితా ఇవ్వండి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణమాఫీ ప్రకటించడంతో ఆయా బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణం పొందిన రుణగ్రస్తుల వివరాలను బ్యాంకర్లు అందించాలంటూ చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్య కోరారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జీవోను గురువారం ఆయా బ్యాంకర్లకు పంపించారు. 2017 నుంచి 2024 వరకు రూ.లక్ష రుణం తీసుకున్న చేనేత కార్మికులు రుణమాఫీకి అర్హులన్నారు. వివరాలు అందిన వెంటనే రుణమాఫీ లబ్ధిదారుల జాబితాను వెల్లడిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు జిల్లా జేపీసీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ప్రీమెట్రిక్ విద్యార్థులకు వసతి ఉందని, ఈ వసతి గృహంలో తగిన మార్పులు చేసి పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వెంటనే కొత్త టెక్నీషియన్ నియమించాలని కోరారు.

ఘనంగా అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలు

నారాయణపేట, ధన్వాడ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు చిట్టెం అభిజయ్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ యువనాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ హోంలో చిన్నారులకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఓ మెంబర్ పోషల్ రాజేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



మిట్టనందిమళ్లలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్ల పాటిమీద ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు కొనసాగుతున్న సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. పూజల్లో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, శశిధర్‌రెడ్డి, లాల్‌కోట వెంకటన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శరత్‌రెడ్డి పాల్గొని ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు అశేషంగా తరలొచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. గ్రామ ఆడపడుచులకు చీరసారెలను పెట్టి తమ ఆచార సంప్రదాయాలను చాటుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

పోషమ్మ తల్లీ పాహిమాం..

ఆత్మకూర్: పట్టణంలో పునర్నిర్మించిన పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వాసు నామ సంవత్సరం జ్యేష్ఠశుద్ధ దశమి ఉదయం 5 గంటల నుంచి ప్రాతఃపూజలు, గర్తన్యాసములు, ప్రతిష్ఠాంగహోమం, ఉదయం 7.56 గంటలకు యంత్ర, విగ్రహాల ప్రతిష్ఠ తదితర పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే, ఎస్పీ ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్‌తో పాటు పలువురు ప్రముఖులు పోషమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ముందుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోస్గి మున్సిపాలిటీలోని 16 వార్డులకు గాను 210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం నుంచి విడతల వారీగా నిధులు మంజూరవుతాయని, నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు , పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ , ఇద్రుస్ , అన్నకిష్టప్ప , బాల్‌రాజ్ , సోమశేఖర్ , దోమరాజేశ్వర్ , దేవేందర్ ఉన్నారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యుల నిరసన



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

నారాయణపేట: ఆపరేషన్ గోమాతలో భాగంగా విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని వీర సావర్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం గోరక్ష చట్టాలు అమలు పరచడంలో విఫలమైందని గోవులపై , గో రక్షకులపై జరుగుతున్న దాడులకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. గోవధ శాలలను వెంటనే సీజ్ చేయాలని, ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గోశాలల నిర్వహించేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు ప్రవీణ్, మురళీ, వడ్ల శ్రావణ్, అనిల్, రవి, విజయ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పచ్చదనాన్ని పెంచుదాం



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోస్గిరూరల్: ప్రజలు తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. గురువారం పట్టణంలోని ఉ ప్పుకుంట చెరువు దగ్గర ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలునాటారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

దామరగిద్ద: పర్యావరణాన్ని రక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ సాయిలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సంజీవరాయ చౌరస్తా వరకు మహిళ సంఘాల సభ్యులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం అలాగే మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణాన్ని రక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు.

నర్వ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీనువాసులు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లో క్లీన్, గ్రీన్ విలేజ్ వీక్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సంఘాలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు మొక్కలు నాటారు.

ఊట్కూరు: పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఊట్కూరులో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

పర్యావరణ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కొత్తపల్లి: మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీఓ రామన్న కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిడ్జింత గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్లోబల్ వార్మింగ్ నుంచి భూమిని కాపాడుకునేందుకు చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం , ప్లాస్టిక్ వాడకం తగ్గించడమే సరైన మార్గమని పేర్కొన్నారు.

మరికల్: ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జెడ్పీ సీఈఓ శైలేశ్ అన్నారు. మరికల్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ ఒకే తాటిపైకి వస్తే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు.

మక్తల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వం నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల్లో ర్యాలీ నిర్వమించారు. అనంతరం ఇరుమలయ్య చెరువు కట్ట దగ్గర మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు.

ధన్వాడ: మండల కేంద్రంలో గురువారం పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి మొక్కలు పెంచాలని సూచించారు.



దామరగిద్దలో అవగాహన ర్యాలీ



ఊట్కూరులో..



మానవహారం నిర్వహించిన అధికారులు

ఆధునిక వ్యవసాయంతో అధిక లాభాలు

ఆత్మకూర్: రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని, సాగులో నూతన సాంకేతికత తోడైతే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనీల్, సురేష్‌కుమార్‌లు అన్నారు. గురువారం వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మేడేపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. వానాకాలంలో పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, పచ్చిరొట్టె ఎరువులను వాడాలని, వరికొయ్యలను తుగులబెట్టకుండ నేలలోనే మక్కే విధంగా చేసి నేల సారాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గోన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రత్యేక క్యాంపులో దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, ఇతర పరికరాలను అందజేశారు. ఎంపీ డీకే అరుణ సహకారంతో అలింకో హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శారీరక, మానసిక దివ్యాంగులకు వీల్‌చైర్లు, చేతి కర్రలు ఇతర పరికరాలను పంపిణీ చేసినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డా.నాగరాజు, వరప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు రాచాల రాజు, రవి, అశోక్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితేనే నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటారని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 200 మందికి పైగా విద్యార్థులకు గురువారం బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎందులోనూ తీసిపోరని.. రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించడం గొప్ప విషయమని అన్నారు. పదో తరగతి తర్వాత ఉపాధి ఆధారిత కోర్సులను ఎంపిక చేసుకోవడం వల్ల జీవితంలో త్వరగా స్థిరపడొచ్చని విద్యార్థులకు సూచించారు.

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శంభుప్రసాద్‌కు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు.